నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 1 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

# అలరించిన ఫ్రెషర్స్ డే



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న రిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు

ఆదిలాబాద్ రిమ్స్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన మొదటి సంవత్సరం వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే అలరించింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తోపాటు వైద్య కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఎదులాపురం, సెప్టెంబర్ 30

నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజారామ్ యాదవ్

## బీసీలను మరోసారి మోసం చేసేందుకు
# కాంగ్రెస్ కుట్ర

- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..
- కామారెడ్డి హామీలను అమలు చేయాల్సిందే..
- లేదంటే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను దోషిగా నిలబెడుతాం..
- నిర్మల్ బీసీల సత్యాగ్రహ దీక్షలో పిలుపునిచ్చిన రాజారామ్ యాదవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 30 : సమగ్ర కుల గణన చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. సోమవారం నిర్మల్ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుట నవ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల సత్యాగ్రహ దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజారామ్ యాదవ్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీకి కట్టుబడి సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో రాహుల్ గాంధీ ఒక మాట రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక మాట మాట్లాడుతున్నారని ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. బీసీల ఓట్లు కొల్లగొట్టడం కోసమే కులగణన చేస్తామని, అసెంబ్లీలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఒక నాటకం ఆడిందని ఆరోపించారు. బీసీల ఓట్లు కావాలి కానీ వారికి పదవులు మాత్రం వద్దా అన్ని ప్రశ్నించారు. కేవలం తన సామాజిక వర్గానికి మాత్రమే పదవులు ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. నవ సంఘర్షణ సమితి ఆల్ ఇండియా చైర్మన్ జైహింద్ గౌడ్ మాట్లాడుతూ.. తమ కులాల్లో ఉన్న మహనీయులను స్మరిస్తూనే రిజర్వేషన్ల సాధన కోసం ఐక్య సంఘటనగా ఏర్పడి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. పార్టీల కతీతంగా బీసీ ఉద్యమంలో అందరు కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గజేంద్ర యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ప్రముఖ అడ్వొకేట్ మల్లారెడ్డి, టీ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, ఓబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వేణుకుమార్ పాల్గొన్నారు.


చేతులెత్తి ఐక్యత చాటుతున్న నాయకులు


ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతంలో పర్యటిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న


జోగు రామన్నతో గోడు వెళ్లబోసుకుంటున్న ఖానాపూర్‌వాసులు

# కుక్కర్లు పంచారు.. కూలగొడుతున్నారు

- బుల్డోజర్‌లను అడ్డుకుంటాం..
- ఇండ్లను కూలగొట్టనియ్యం
- పేదలకు మాజీ మంత్రి రామన్న భరోసా
- ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల పర్యటన
- ప్రభుత్వ తీరుపై స్థానికుల ఆగ్రహం

ఆదిలాబాద్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ) : గత అసెంబ్లీ ఎన్నికల ముందు కుక్కర్లు పంచిన అధికార పార్టీ నాయకుడు ఆదిలాబాద్‌కు హైడ్రాను తీసుకొచ్చానంటూ ప్రకటించి పేదల ఇండ్లను కూలగొట్టడానికి కారణమయ్యాడని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. సోమవారం ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లోని బోక్కల్‌గూడ, ఖానాపూర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి అధికారులు మార్కింగ్ చేసిన ఇండ్లను పరిశీలించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా తిరుగుతూ పేదలతో మాట్లాడారు. 50 సంవత్సరాలుగా తాము ఖానాపూర్ ఏరియాలో నివాసం ఉంటున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో పేదలపై కక్ష్యపూరిత ధోరణి అవలంబిస్తూ తమ ఇండ్లను కూలగొట్టడానికి చర్యలు తీసుకుందన్నారు. కూలీ పనులు చేసుకునే తాము పైసా, పైసా కూడబెట్టి కట్టుకున్న ఇండ్లను కూలగొట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. పదేండ్లు కేసీఆర్ ప్రభుత్వం తమను అన్ని సౌకర్యాలు కల్పించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరిట అన్యాయం చేస్తుందన్నారు. అధికారులు తమ ప్రాంతాల్లో ఇండ్లను మార్కింగ్ చేస్తున్నప్పటి నుంచి తాము తిండి, నిద్రకు దూరమయ్యాయమని ఎప్పుడు బుల్డోజర్‌లు పంపి ఇండ్లు కూలగొడుతారో అని భయపడుతున్నామని స్థానికులు తెలిపారు.

### పేదల ఇండ్ల జోలికొస్తే సహించే ప్రసక్తి లేదు

ఖానాపూర్ పరిసరాల్లో పేదల ఇండ్లను కూలగొడితే సహించే ప్రసక్తే లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా కేఆర్‌కే కాలనీలో ఇండ్లను కూలగొడితే తాను ఎమ్మెల్యేగా ఉండి బుల్డోజర్‌లకు అడ్డంగా పడుకున్నామన్నారు. ఇప్పుడు బుల్డోజర్‌లు వస్తే తాము ముందుగా అడ్డుకుంటామన్నారు. ఖానాపూర్ ఏరియాలో నివాసం ఉండేవారు కూలీ పనులు, కూరగాయలు అమ్ముకునే జీవించేవారని, రెక్కలకష్టంతో కట్టుకున్న ఇండ్లను ప్రభుత్వం ఎలా కూల్చివేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతకాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పేరిట నాటాకాలు ఆడుతున్నారని, ప్రజలను భయందోళనకు గురిచేస్తున్నారని తెలిపారు. పేదలకు రూ.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోగా ఉన్న ఇండ్లను కూలగొడుతూ వారిని గోస పుచ్చుకుంటున్నారన్నారు. స్థానికులు ఎలాంటి సహాయం కావాలన్నా తమ నాయకులను ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వారిపై పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని జిల్లా ఎస్పీని కలుస్తామని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు కేసుల విషయం చెప్పి పోలీసు అధికారులతో మాట్లాడిస్తామని హామీ ఇచ్చారు. ఖానాపూర్ ప్రాంత వాసులు ఇండ్ల విషయంలో బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్థానికులు ఎలాంటి ఆందోళన చెందకుండా తమ రోజువారి పనులు చేసుకోవాలి సూచించారు. ఎలాంటి ఆపద వచ్చినా తమకు తెలియజేయాలన్నారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, విజ్జిగిరి నారాయణ, సాజీదొద్దీన్, శివకుమార్, సలీం, ఎజాజ్, కలీం, అతావుల్లా, ఆసీఫ్, రఘు, స్వరూపరాణి, కరుణ, తదితరులు ఉన్నారు.


అధికారులు మార్కింగ్ చేసిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం

## ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 30 : సుదీర్ఘకాలంపాటు సేవలందించి పదవీ విరమణ పొందిన నలుగురు పోలీస్ అధికారులకు సోమవారం పోలీస్ హెడ్‌కార్టర్స్‌లో పదవీ విరమణ పొందిన అధికారులకు ఎస్పీ గౌష్ ఆలం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంపాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగడానికి అహర్నిశలు కష్టపడిన ప్రతి ఒక్కరి కృషిని అభినందించారు. సంఘ విద్రోహశక్తులతో పోరాడి, ప్రశాంత వాతావరణంలో ప్రస్తుత జిల్లా ఉండడానికి కారణమైన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలను కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. పదవీ విరమణ పొందిన ఎస్ఐలు ఉషన్న, ఖాజాగౌస్ మొయినొద్దీన్(మోబీన్), అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.యువరాజ్, హెడ్ కానిస్టేబుల్ సిరికొండ లింగన్న ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్) బి సురేందర్‌రావు, డీఎస్పీ బి సురేందర్‌రెడ్డి, సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, జైస్వాల్ కవిత పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎంఐఎం పార్టీ నాయకులు

# ఎవరు భయపడొద్దు.. అండగా ఉన్నాం..

ఎదులాపురం, సెప్టెంబర్ 30 : పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాలలో నివాసం ఉంటున్న వారు ఎవరు భయపడవద్దని, అండగా ఎంఐఎం పార్టీ నాయకులు ఉన్నారని పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. సోమవారం ఖానాపూర్ చెరువు పరిసరాల ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు ఎంఐఎం పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. కాలనీవాసులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. జిల్లా కాంగ్రెస్ నేతలు హైడ్రాపై ద్వంద్వ వైఖరి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షానావజ్ హుస్సేన్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, బాబుషా, సలీం, అదనాన్, తదితరులు ఉన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

ఎదులాపురం, సెప్టెంబర్ 30 : రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాంపెల్లి వేణుగోపాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు. మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రకారం గౌరవ వేతనం ప్రకటించి, క్వింటాలుకు రూ.300 కమీషన్ పెంచాలన్నారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. దిగుమతి హమాలీ ప్రభుత్వమే భరించాలన్నారు. ఒక శాతం తరుగిచ్చి, ప్రతి నెల ఈ పాస్ నుంచి తీయాలన్నారు. డీలర్ చనిపోతే, దహన సంస్కారాలకు రూ.50 వేలు ఇవ్వాలని కోరారు. కేంద్రం పెంచిన 20 పైసల కమీషన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం వాటా 10 పైసలు ఏప్రిల్ 2022 నుంచి నవంబర్ 2023 వరకు ఏరియర్స్ విడుదల చేయాలన్నారు. ఈ కలిసిన వారిలో కోషాధికారి హరీంద్ర, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# ఐటీడీఏకు ఆదరణ తగ్గుతుంది

ఉట్నూర్, సెప్టెంబర్ 30 : ఐటీడీఏ ద్వారా సక్రమంగా రుణాలు రాకపోవడంతో ఐటీడీఏకు గిరిజనుల రాక తగ్గుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ ట్రైబల్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో గిరిజనులకు సబ్సిడీ ద్వారా రుణాలు, ఎంప్లాయిమెంట్ కల్పించాలని డిమాండ్ చేశారు. గిరివికాసం పథకం ఏదైతే అమలు చేస్తున్నారో అది వ్యక్తిగతంగా ఇవ్వాలని, ఒక యూనిట్‌కు ఇద్దరు, ముగ్గురికి కలిపి ఇవ్వొద్దని తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ట్రైకార్ మీటింగ్‌లో కూడా పథకాలు కేవలం సబ్సిడీ వరకే కాకుండా బాగు పడాలనే ఉద్దేశంతో అమలు చేయాలని కోరడం జరిగిందన్నారు. గతంలో గిరిజనులు ఐటీడీఏకు వస్తే న్యాయం జరుగుతుందని వచ్చేవారని, ఇప్పుడు చెప్పులు అరిగేలా తిరిగిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గిరివిసాక్ పథకం రూ.2 లక్షలతో అమలు చేస్తున్నారన్నారు. దానిని పెంచాలని కోరారు. ఐటీడీఏకు మళ్లీ కళ పెరుగాలంటే ప్రభుత్వం బడ్జెట్ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉన్నారు.

# అక్రమ కట్టడాలను తొలగించాలని వినతి

- ఆర్డీవో హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా చలనం లేదు
- 20కి పైగా కుల సంఘాల ప్రతినిధులు

కుభీర్, సెప్టెంబర్ 30 : నెల రోజుల కిందట కుభీర్ గ్రామస్తులు కలిసి ప్రభుత్వ పని తీరును నిరసిస్తూ ప్రధాన రహదారి దిగ్బంధించి ధర్నా, రాస్తారోకో, వంటవార్పు చేసి నిరసన చేపట్టారు. కలెక్టర్ వచ్చేదాకా ఇక్కడి నుంచి వెళ్లబోమని వందలాది మంది ఆందోళన చేశారు. అధికారులు పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. దీంతో భైంసా ఆర్డీవో వచ్చి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి పక్షం రోజుల్లో అక్రమ కట్టడాలను తొలగింప చేస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింప చేశారు. గడువు దాటినా అధికారుల్లో చలనం లేకపోవడంతో సోమవారం 20కి పైగా కుల సంఘాల పెద్దలు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మేదరిగల్లి, ప్రభుత్వ ఆసుపత్రి, శ్రీవిఠలేశ్వరాలయంలో మురికి, వరద నీరు చొరబడకుండా కాపాడాలని, మసమ్మ చెరువు కట్ట, వడ్డెర కాలనీ నుంచి చేలకు వెళ్లేదారి, కురుమ కుల శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. బొయిడి విఠల్, సాప పండరి, బొప్ప మోనాజీ, సుభాష్, కే.పోతన్న ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కుభీర్ వాసులు


ఐటీడీఏ కార్యాలయం బయట నిలబడిన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# సమస్యల పరిష్కారానికి కృషి

తలమడుగు, సెప్టెంబర్ 30 : బోథ్ నియోజకవర్గంలో నెలకున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐడీటీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదు విభాగం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిలబడి ఉన్న తాంసి, తలమడుగు మండలాల మహిళలను గుర్తించి వారి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతి పత్రం అందజేశారు. తలమడుగు మండలంలోని నర్సాపూర్ ఎస్టీ (కొలం) పీవీటీజీకి చెందిన 14 మంది మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తీసుకున్నారన్నారు. తమకు ఉపాధి కోసం కుట్టు మిషన్ మంజూరు చేయాలని కోరారు. దీంతో మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు మర్సుకోల అశోక్, కత్లే పృథ్వీరాజ్ పాల్గొన్నారు.


పొలం నుంచి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

# గిరిజనులకు క'న్నీటి' కష్టాలు

- బీఆర్ఎస్ పాలనలో కొండను చేరిన మిషన్ భగీరథ నీళ్లు
- ప్రస్తుతం 40 శాతం మాత్రమే..
- పైపుల లీకేజీతో సమస్య జఠిలం
- గ్రామస్తులకు పెరిగిన నీటి కష్టాలు

తలమడుగు, సెప్టెంబర్ 30 : కాలం మారిన గిరిజనులకు మాత్రం నీటి కష్టాలు తప్పడం లేదు. మండలంలోని కొండపైన ఉండే పల్లి గ్రామ ఆదివాసీ గిరిజనులకు నిత్యం తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. మంచినీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుని జీవనం కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడుగా నాలుగు రోజుల క్రితం మండలంలోని పొన్నారి గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ పగలడంతో నీటి కష్టాలు ఎక్కువ అయ్యాయి. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు వ్యవసాయ పొలంలోని బావుల నుంచి నెత్తిపై బిందెలు పెట్టుకుని, ఎడ్ల బండిపై తాగునీటిని తెచ్చుకుంటున్నామని గిరిజనులు తెలిపారు. పైపులు లీకేజీ అవ్వడంతో నీళ్లు వస్తలేవని అధికారులు అంటున్నారు. నీటి కోసం వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సి వస్తుంది. పైపులను మరమ్మతులు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

